క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించడంతో పాటు నూతన ఆధార్ నమోదు కోసం ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. సచివాలయాల పరిధిలోని చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం కపిలేశ్వరపురం, వడ్లమూరులలోనూ, 20, 21వ తేదీల్లో అంగర, కోరుమిల్లి, 22న తాతపూడి, కోరుమిల్లి, 24, 25 తేదీల్లో పడమర ఖండ్రిక, మాచర, 28న కపిలేశ్వరపురం, టేకిలలో శిబిరాలను నిర్వహించనున్నారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రలు ఆధార్ వివరాలను నవీకరణ చేస్తారని ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం రూరల్: ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రత్నాలరావు సూచనల మేరకు మండలంలోని ద్రాక్షారామ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ద్రాక్షారామ ఫీడర్, 11 కేవీ వెంకటాయపాలెం ఫీడర్‌లు మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మేడిశెట్టి వెంకటరమణ మంగళవారం తెలిపారు. పై ఫీడర్‌ల పరిధిలోని ద్రాక్షారామలోని కోటిపల్లి రోడ్డు, యానం సెంటర్, రంగనాయకులపేట, కుందాలమ్మ చెరువు, దాసరపాడు, వెలంపాలెం, చిన్నంపేట, వల్లూరివారి పేట, వెంకటాయపాలెం, ద్రాక్షారామ గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



రథయాత్ర కరపత్రాలు పంచి పెడుతున్న బ్రహ్మ కుమారీలు

రాయవరం: హిందూ ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు పునరుద్ధరించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బ్రహ్మ కుమారీలు పిలుపునిచ్చారు. మండలంలోని చెల్లూరు, కూర్మాపురం గ్రామాల్లో బ్రహ్మ కుమారీలు రథయాత్ర నిర్వహించారు. పరమాత్ముని దివ్య అవతరణ, కర్తవ్యాలను అందరికీ తెలియ జేయాలనే ఉద్దేశ్యంతో ఈ రథయాత్రను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు చంద్రలేఖ, భాగ్యలక్ష్మి, కుమారి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంజేరుకు బస్సును పునరుద్ధరించాలి

కాజులూరు: రాజమహేంద్రవరం డిపో నుంచి మండలంలోని మంజేరుకు గతంలో రాకపోకలు చేసే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. మంగళవారం కాజులూరులో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం నుంచి రామచంద్రపురం, ద్రాక్షారామ మండలంలోని కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, చేదువాడల మీదుగా ప్రతిరోజు ఓ బస్సు నాలుగు పర్యాయాలు మంజేరుకు రాకపోకలు చేసేదన్నారు. కొన్నాళ్లుగా నష్టాల సాకుతో అధికారులు బస్సును నిలుపు చేశారన్నారు. మండల పరిధిలోని గ్రామాల నుంచి ప్రతిరోజు అధిక సంఖ్యలో ప్రజలు రామచంద్రపురం, రాజమహేంద్రవరం తదితర పట్టణాలకు వెళుతుంటారని అన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సును పునరుద్ధరించాలన్నారు. కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, మంజేరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గండి గోపాల్, చేదువాడ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ చైర్మన్ గంజా సూరిబాబు తదితరులు బస్సు కోసం డిమాండ్ చేసిన వారిలో ఉన్నారు.

దిడ్ల రాఘవులుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం



కాజులూరు పాఠశాలలో ఓటు అభ్యర్థిస్తున్న రైతు సంఘాల నాయకులు

కాజులూరు: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల రాఘవులుకు మద్దతుగా రైతు సంఘాల నేతలు మంగళవారం మండల గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రభుత్వ కళాశాలు, ప్రభుత్వ పాఠశాలలు, బ్యాంకులను సందర్శించి పట్టభద్రులను కలుసుకున్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు బుడితి ప్రభాకరరావు, నామా చంద్రరావు, పోతుల మహాలక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. విజయోస్తు

- పది పరీక్షలకు ప్రత్యేక ప్రణాళికలు
- అమలుకు విద్యాశాఖాధికారుల కసరత్తు
- ఫలితాలపై ప్రత్యేక దృష్టి
- క్లస్టర్ పరిధిలో 5,446 మంది విద్యార్థులు



పదో తరగతి విద్యార్థినులు

రాయవరం: విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైనది. ఉన్నత చదువులు, ఉద్యోగం ఇలా జీవితంలో ఉన్నత స్థితికి చేరాలంటే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. అందుకే పదో తరగతి విద్యార్థులతో పాటు తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు ఇది పరీక్షా సమయమే. పలు పాఠశాలలు నూరుశాతం మార్కులు సాధించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో ఇలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 94 ఉన్నత పాఠశాలలున్నాయి. క్లస్టర్ పరిధిలో 5,200 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనుండగా, మండపేట నియోజకవర్గంలో 3, 210 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 2,236 మంది పరీక్షలు రాయనున్నారు. వీరికోసం 29 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పరీక్షా కేంద్రాలు
రాయవరం	13	689	04
రామచంద్రపురం	32	1,626	09
కె.గంగవరం	11	458	04
మండపేట	28	1,877	09
కపిలేశ్వరపురం	10	451	03
మొత్తం	94	5,101	29

ప్రైవేటుకు దీటుగా..

కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు సైతం నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయి. దీనికి విద్యాధికారులు, ఉపాధ్యాయుల కృషే కారణం. ప్రైవేటు పాఠశాలలకు తాము ఏమాత్రం తీసిపోమని సర్కారు విద్యార్థులు నిరూపిస్తున్నారు. జూలై నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

ఇలా చేస్తే మంచిది

ప్రతి సబ్జెక్టులో ప్రధానమైన పాఠాలను బాగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. కఠినమైన పదాలకు అర్థాలను నోటు పుస్తకంలో రాసుకోవాలి. ఉపాధ్యాయులు సూచించిన ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం. ఒత్తిడికి దూరంగా ఉండి ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతతో చదవాలి. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని చదవడం వలన ఫలితం ఉండదు. దీంతో పరీక్షల సమయంలో ఎక్కువగా అలసిపోతారు. కష్టంగా ఉన్న సబ్జెక్టులను వేకువజామున చదివితే మెదడు ప్రశాంతంగా ఉండి బాగా గుర్తుంటాయి. పాత ప్రశ్నా పత్రాలను సాధన చేయాలి. అందులోని ప్రశ్నలే ఎక్కువగా రావడానికి అవకాశం ఉంటుంది.

నిరంతర పర్యవేక్షణ



పదో తరగతి ఫలితాల్లో రామచంద్రపురం డివిజన్ పరిధిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నాం. ప్రధానోపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఆదేశాలిచ్చాం. ఎప్పటికప్పుడు స్లిప్ టెస్ట్‌లు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

పి.రామలక్ష్మణమూర్తి, ఉప విద్యాశాఖాధికారి, రామచంద్రపురం.

రోజువారీ ప్రణాళిక అమలు



జిల్లా విద్యాశాఖ ఇచ్చిన రోజువారీ ప్రణాళికను అమలు చేస్తున్నాం. సమ్మెటివ్-1లో మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. నూరు శాతం ఫలితాల సాధనకు తగిన ప్రణాళికను అమలు చేస్తున్నాం.

టీవీ సురేంద్రచౌదరి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, తాపేశ్వరం, మండపేట మండలం.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గతేడాది ఫలితాలను బేరీజు వేసుకుని, గతంలో అనుసరించిన విద్యా బోధనతో ముందుకు సాగుతున్నాం. ఈ ఏడాది కూడా నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

విత్తనాల సుబ్బారావు, హెచ్‌ఎం, మున్సిపల్ ఉన్నత పాఠశాల, రత్నంపేట, రామచంద్రపురం.

చలో తుని కార్యక్రమం అడ్డగింపు



గొల్లప్రోలు చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: సంఖ్యా పరంగా వైఎస్సార్ సీపీ బలం ఉన్నప్పటికీ వైస్ చైర్మన్ పీఠం ఎలాగైనా దక్కించుకోవాలని కూటమి నేతలు కుయుక్తులతో కుట్రలు పన్ని వైఎస్సార్ సీపీ సభ్యులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వైఎస్సార్ శ్రేణులు వారికి అండగా నిలబడటానికి చలో తుని కార్యక్రమం తలపెట్టారు. శాసన మండలి సభ్యుడు తోట త్రిమూర్తుల పిలుపు మేరకు మండపేట నుంచి ఆ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే శ్రీకృష్ణ కార్యకర్తలతో కలిసి తుని పయనమయ్యారు. వారిని గొల్లప్రోలు చెక్‌పోస్టు వద్ద పోలీసులు అడ్డుకున్నారని శ్రీకృష్ణ తెలిపారు. తుని వైస్‌చైర్మన్ పదవి కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కూటమి నేతలు దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ అనంతబాబు, యువజన విభాగం జిల్లా కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పోలీసుల చర్యతో రోడ్డుపై బైఠాయించినట్టు శ్రీకృష్ణ తెలిపారు.

కరుణామయ యూత్ సేవలు అభినందనీయం



బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న యూత్ సభ్యులు

మండపేట: మండలంలోని కేశవరంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తున్న కరుణామయ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ పలువురి మన్ననలు అందుకుంటోంది. గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మందపల్లి ప్రతాప్, పోసుపో అశోక్, చంద్రమళ్ల సుధీర్, చుక్కా రాజేష్ తదితరులు సంస్థ ద్వారా దాతృత్వాన్ని చాటుతున్నారు. ఇటీవల గ్రామంలో బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందిన కుటుంబ పెద్ద లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు, 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా సరకులు, కూరగాయలు అందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు చంద్రమళ్ల శ్రీకాంత్, పెన్నేటి చంద్రహాస్, పైడిమళ్ల బ్రిజిలీబాబు, పోసుపో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పునాది అభ్యసనాన్ని అభివృద్ధి చేయాలి



జ్ఞానజ్యోతి శిక్షణా శిబిరంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: పునాది అభ్యసనాన్ని ప్రీ ప్రైమరీ పాఠశాల స్థాయి నుంచి అభివృద్ధి చేయాలని రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీవైఈవో రామలక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో 120 రోజుల సర్టిఫికేట్ శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకుని, తిరిగి అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పునాది అభ్యసనాన్ని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత తదితరులు మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేఆర్‌పీ కేవీఆర్ తాతాజీ, డీఆర్పీలు ఎం.విజయకుమార్, ఎం.రాజు తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణనిచ్చారు.

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు హౌస్ అరెస్టు

రావులపాలెం: మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావును మంగళవారం రావులపాలెంలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా చలో తుని కార్యక్రమానికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అక్కడకు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తుని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయడంపై రాజా చలో తునికి పిలుపు నిచ్చారని, దీంతో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూర్యారావును అక్కడికి వెళ్ల వద్దని నోటీసు అందినట్టు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

గన్నవరపు హౌస్ అరెస్టు

అయినవిల్లి: కాకినాడ జిల్లాగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపు ఇచ్చిన చలో తుని కార్యక్రమానికి హాజరు కాకుండా పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్‌రావుని మంగళవారం హౌస్ అరెస్టు చేశారు. కానిస్టేబుల్ నోటీస్ అందించి తుని కార్యక్రమం వెళ్లకుడదని హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాపక్షాన పోరాడేవారిని అణగ దొక్కే ప్రయత్నాలు చేస్తుందని అటువంటి చర్యలు మానుకోవాలన్నారు. అలాగే విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్ నారాయణస్వామిని కూడా అరెస్టు చేశారు.

స్వచ్ఛ మండపేట లక్ష్యంగా పని చేయాలి



ఆర్పీలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: స్వచ్ఛ మండపేట లక్ష్యంగా పని చేయాలని మెప్మా ఆర్పీలకు కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మంగళవారం మెప్మా ఆర్పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ మండపేట లక్ష్యాలకు అనుగుణంగా ఆర్పీలు నడుచుకోవాలన్నారు. పట్టణంలోని 30 వార్డులు పర్యటించి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై స్థానిక మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పారిశుధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియ అని నిత్యం దానిపై శ్రద్ధ వహిస్తూనే ఉండాలన్నారు. అనంతరం వారిని వెంటబెట్టుకుని 21వ వార్డులోని రావులపేట చుట్టు పక్కల వీధుల్లో పర్యటించారు. డ్రెయిన్లలో చెత్తా చెదారాలు వేయరాదన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సీవీబీ వీరలక్ష్మి, శానిటేషన్ సెక్రటరీ ఏ దుర్గాశేఖర్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఎనిమిదో వేతన సంఘం అమలు చేయాలి

నల్ల బ్యాడ్జీలతో తపాలా ఉద్యోగుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మండపేట: గ్రామీణ తపాలా ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించి ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే అమలు చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు కొండపల్లి సూర్యనారాయణ, జీ వెంకట్రావు, ఎండీఎం షరీఫ్, పిల్లా నాగేశ్వరరావు, పీ పద్మలు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తపాలా కార్యాలయం ఎదురుగా మంగళవారం తపాలా ఉద్యోగులంతా తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తపరిచారు. తపాలా శాఖ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. పోస్టల్ చట్టం 2023 జీవోను రద్దు చేయాలని నినాదాలు చేశారు. పోస్టల్ శాఖ యూనియన్లను సంప్రదించకుండా ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. హక్కుల సాధన కోసం విజయవాడలో ఈ నెల 25న తలపెట్టిన ధర్నాలో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండపేట, చెల్లూరు, తాపేశ్వరం, సబ్ పోస్టాఫీస్ పరిధిలోని బ్రాంచ్ ఆఫీసుల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో బహుళ ప్రయోజనం

మామిడికుదురు: ఆరుతడి పంటలో రైతులకు బహుల ప్రయోజనం కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం జె.ఎలియాజర్ సూచించారు. ఆరుతడి పంటలపై ఈదరాడ, మాకనపాలెం గ్రామాల్లో రెండు రోజుల శిక్షణా సమావేశాలు మంగళవారం ముగిసాయి. దీనిలో భాగంగా ఈదరాడలో జరిగిన సమావేశంలో ఎలియాజర్ మాట్లాడారు. కార్బన్ ఉద్గారాలను నియంత్రించుకోవాలని సూచించారు. ఆరుతడి విధానం ద్వారా 30 శాతం సాగునీరు ఆదా అవుతుందన్నారు. 50 శాతం వరకు మీథేన్ ఉద్గారాలను తగ్గించుకోవచ్చన్నారు. వేరు దశ మెరుగుపడుతుందన్నారు. వ్యాధుల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందన్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందని చెప్పారు. దోమలు, నీటి ద్వారా వచ్చే వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. రైతులు విశిష్ట ఐడీని వెంటనే పొందాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు ఉత్తమ రైతులను సమావేశంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఏడీపీఎం ఎంవీవీ సత్యనారాయణ, ఏఓ కె.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ రాధిక, మాస్టర్ ట్రైనీలు జె.నాగవేణి, కె.జానకి, మేడల్ మేకర్లు సీహెచ్ రాధ, కె.పద్మావతి, రైతులు యెరుబండి సూరిబాబు, యెరుబండి లక్ష్మయ్య, కుసుమ శ్రీధర్, నయనాల శ్రీరంగనాథం తదితరుల పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయం.. ఆధ్యాత్మిక క్షేత్రం

నేడు వాడపాలెంలో అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతి ఆలయ 10 వార్షికోత్సవం



వాడపాలెం అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతి ఆలయం

కొత్తపేట: వాడపాలెంలో ఉన్న అయ్యప్పస్వామి, జ్ఞాన సరస్వతీదేవి ఆలయం పది వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ ఆలయ నిర్మాణంతో ఆ గ్రామం ఆధ్యాతికంగా విరాజిల్లుతుంది. ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. గౌతమీ గోదావరి నదీతీరాన బొబ్బర్లంక - ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువకు చేర్చి విశాలమైన స్థలాన్ని సమకూర్చి 2015 సంవత్సరంలో ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో కింద జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారిని, పైన అయ్యప్పస్వామిని ప్రతిష్ఠించారు. ఈ ఆలయ వార్షికోత్సవం, వివిధ పుణ్య తిథులు, అయ్యప్పస్వామి మండల, జ్యోతి దీక్షలు పురస్కరించుకుని ఆ క్షేత్రం, ఆ గ్రామం ఆధ్యాతికంగా అలరారుతుంది. ఇక్కడ అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన మాలధారులకు 41 రోజుల పాటు ఉచిత బిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 250 మంది మాలదారులు బిక్షను స్వీకరిస్తారు. వసంత పంచమి సందర్భంగా వందలాది మంది బాలలతో సరస్వతీదేవి పూజ ఘనంగా నిర్వహించి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తారు. ఈ నెల 19 మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా ఆలయ 10 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇన్‌చార్జి మట్టా బాబ్జి తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకుర్తి రామచంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం నుంచీ అయ్యప్ప స్వామి, జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారికి, పరివార దేవతలకు విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కన్నబాబుకు వైఎస్సార్ సీపీ నాయకుల అభినందనలు



కన్నబాబును అభినందిస్తున్న పాపారాయుడు, నాయకులు

మండపేట: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు అభినందనలు తెలిపారు. సోమవారం రాత్రి ఆయనను మండపేట నియోజకవర్గ వైఎస్సార్ నాయకుడు కుడిపూడి రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పలివెల సుధాకర్‌లతో పాపారాయుడు కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. పాపారాయుడు మాట్లాడుతూ పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, అంకిత భావం చూసి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర పగ్గాలు అప్పగించారని పేర్కొన్నారు.

హోమియో వైద్యశాలలో వైద్యుడి నియామకం



ఆసుపత్రిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో గల ప్రభుత్వ హోమియో వైద్యశాలకు గత కొన్ని నెలలుగా డాక్టర్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడేవారు. స్థానికులు వెంటనే వైద్యుడ్ని ఏర్పాటు చేయాలని గత కొంత కాలంగా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించారు. ఏట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రికి డాక్టర్‌ను నియమించారు. ఆసుపత్రికి వైద్యుడ్ని నియమించడంతో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

రామచంద్రపురం రూరల్: అదనపు కట్నం కోసం తనను భర్త, అత్త, ఆడ పడుచులు వేధిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ద్రాక్షారామకు చెందిన చెరుకూరి నాగ మనోజ్ఞకు తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన శివరామ్‌తో 2017లో వివాహమైంది. పెళ్లి సమయంలో లక్షలాది రూపాయల కట్నంతో పాటు బంగారం, వెండి వస్తువులు లాంఛనంగా ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టే వరకు కాపురం సజావుగానే సాగింది. ఆ తరువాత నుంచి అదనపు కట్నం తీసుకు రావాలని భర్త శివరామ్‌తో పాటు అత్త, ఆడపడుచులు తనను చిత్ర హింసలకు గురి చేస్తున్నారని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై..

రామచంద్రపురం రూరల్: తన భర్త కనిపించడం లేదని మండలంలోని జగన్నాయకులపాలేనికి చెందిన ముద్దాల అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అన్నపూర్ణ భర్త ముద్దాల అప్పారావు ట్రాక్టరు, లారీలకు డ్రైవరుగా పని చేసేవాడు. అప్పుడప్పుడూ ఇంటిలోని వారికి కనిపించకుండా ఎక్కడికో వెళ్లిపోయేవాడు. తిరిగి వారం, పది రోజుల తరువాత ఇంటికి వచ్చేవాడు. 2024 నవంబరు 7వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన అప్పారావు నెలలు గడుస్తున్నా రాకపోవడంతో అతడి భార్య అన్నపూర్ణ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

రేమా పెంతెకోస్తు సంఘ వార్షికోత్సవ సభలు

కపిలేశ్వరపురం: అంగరలోని రేమా పెంతెకోస్తు సంఘం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సభలు ప్రారంభమయ్యాయి. పడమర ఖండ్రికలోని హల్లెలూయ గ్రౌండ్స్‌లో సోమ, మంగళవారాల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రైస్తవ ప్రబోధకులు శాంతి వాక్యాలను బోధించారు. బుధవారం వరకూ సభలు కొనసాగుతాయని చర్చి నిర్వాహకులు జ్యోత్స్నరాణి, జాకబ్‌జాయ్, సుందర్ జేసస్ తెలిపారు.